




*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## థేంక్స్ టు పారిస్

**విమానంలోంచి ఏరో** బ్రిడ్జ్ మీదకి రాగానే ఎక్కడినించో వచ్చిన చల్లగాలికి మహిత స్వల్పంగా వణికింది. వీల్ చైర్స్‌తో సిద్ధంగా ఉన్న సిబ్బందిని తప్పించుకుని చురుగ్గా ముందుకి కదిలింది.

"నీ స్ట్రోలర్ కూడా నాకివ్వు. జాకెట్ వేసుకోమంటే వేడి అన్నావు. ఇక్కడ చల్లగానే ఉన్నట్లుంది. మన వింటర్‌వేర్ సరిపోకపోతే కొనుక్కుందాం" వెనకే వస్తున్న రోహిత చెప్పింది.

"బరువేం లేదుగా. పర్లేదు చిరు చలిని అనుభవించడం బాగుంటుంది రోహీ" మహిత చిరునవ్వుతో చెప్పింది.

లగేజ్ కలెక్ట్ చేసుకుని బయటకి వచ్చేసరికి గ్లోబ్ ఉన్న చిన్న జెండా పట్టుకున్న ఒక యూరోపియన్, అతని చుట్టూ లగేజ్ ట్రాలీలతో ఇండియన్స్ కనిపించారు.

"మన 'ఇవాన్ ది గ్రేట్' అతనే అనుకుంటా పద."

రోహిత ఆ సమూహంలో చేరింది. అతను వాళ్ళ పేర్లడిగి, తన పేడ్‌లో వాటి పక్కన టిక్ పెట్టుకుని చెప్పాడు.

"ఈ ఫ్లయిట్‌లో రావల్సిన వాళ్ళందరూ వచ్చారు ఎమిరేట్స్ ఫ్లయిట్ ఇప్పుడే లేండైంది. అందులో మన గ్రూప్ మెంబర్స్ ఆరుగురు వస్తున్నారు. వాళ్ళని రిసీవ్ చేసుకుని అంతా కలిసి మీ హోటల్‌కి వెళ్దాం. మనమిక్కడ వెయిట్ చేయచ్చు. బైదవే నా పేరు ఇవాన్. ఐవాన్ అని కూడా పిలుస్తూంటారు. మీకు ఎలా కావాలంటే అలా పిలవచ్చు" అతని బ్రిటిష్ ఏక్సెంట్ సులభంగా అర్ధమైంది.

"నీ గర్ల్ ఫ్రెండ్ ఏమని పిలుస్తుందో చెప్పు అలా పిలుస్తాం." ఏభై దాటిన ఒకావిడ నవ్వుతూ అడిగింది.

అంతా నవ్వారు. ఇవాన్ కూడా నవ్వి చెప్పాడు.

"లవ్ యువర్ సెన్సాఫ్ హ్యూమర్."

"మహీ కాఫీ తాగుతావా? తినడానికి ఏమైనా కావాలా?" రోహిత అడిగింది.

"వద్దు. ఐయాం గుడ్. రోహీ పేరిస్ అంటే ఎన్నో ఊహించుకున్నా. ఏర్‌పోర్ట్ ఇలా ఉందేంటి? మంచి పెయింటింగ్స్‌తో ఆర్టిస్టిక్‌గా ఉండద్దూ? మన త్రివేండ్రం ఏర్‌పోర్ట్‌లో రాజా రవివర్మ చిత్రాలు ఎంత బావుంటాయ్?" మహిత నిరాశగా అన్నది.

"డిజప్పాయింట్ అవకు. నీకు నచ్చుతుందనే నమ్ముదాం." రోహిత అక్కతో ప్రేమగా చెప్పింది.

అరగంట తర్వాత తమ వైపు వస్తున్న జంటలోని వ్యక్తిని చూసిన మహిత నిర్ఘాంతపోయింది. తర్వాత నీరు కమ్మిన కళ్ళని దాచే ప్రయత్నంలో తలవంచుకుంది.

"ఎందుకు తలదించుకుంటావు? అంత తప్పేం చేసావు? చేసిందంతా ఆ వెధవ. తలెత్తు. నార్మల్‌గా ఉండు. రామేశ్వరం వెళ్ళినా.. అని నాయనమ్మ సామెత చెప్తూండేదే? అలా యూరప్ వచ్చినా ఈ దరిద్రుడి బాధ తప్పడంలేదు." రోహిత కటువుగా చెప్పింది.

"ప్లీజ్ రోహీ" మహిత చెల్లెలి చేతిని పట్టుకుని వారిస్తున్నట్లుగా చెప్పింది.

"నీ శత్రువుముందు నువ్వు కన్నీళ్లతో నిస్సహాయంగా నిలబడితే, వాడే గెలిచినట్లు చేసిందంతా వాడు. ఏడ్చేది నువ్వా? మహీ ఇప్పుడే చెప్తున్నా. ఈ ట్రిప్‌లో నువ్వు వాడిని చూసి ఎమోషనలై నీ మూడ్ పాడుచేసుకున్నావంటే ఊర్కోను. మళ్ళీ పెళ్ళిచేసుకుని హనీమూన్‌కి వచ్చినట్లున్నాడు వెధవ. తిక్కకుదిరింది. మనలాగే వాడూ ఎంజాయ్ చేయలేడు. గిల్ట్ వాడిని నమిలేయదూ?" రోహిత కసిగా చెప్పింది.

ఇవాన్ దగ్గరకి వచ్చి, అతనికి తమ పేర్లు చెప్పాక భార్యతో ఓ పక్కగా నుంచుంటూ వాళ్ళని చూసిన అభిమన్యు ముందు ఆశ్చర్యపోయి, తర్వాత అయిష్టంగా తల తిప్పుకున్నాడు.

ఇవాన్ తన చేతిలోని జెండాని పైకెత్తి పట్టుకుని ముందుకి కదులుతూ చెప్పాడు.

"అంతా వచ్చేసారు. కొద్ది దూరం నడవాలి క్షమించండి. అక్కడికి కాని మన పైలెట్ బస్‌ని తీసుకురాలేదు. అంతా నా వెనకే నడవండి. దయచేసి పక్కకి వెళ్ళొద్దు"

అంతా తమ లగేజ్‌తో అతని వెంటే కదిలారు. మహిత ఓరగా అభిమన్యు భార్యవైపు చూసింది. అందంగా ఉంది. హేండ్‌బేగ్‌ని తగిలించుకుని, అభిమన్యుని ఆనుకుని నడుస్తోంది. అతను ఓ చేత్తో సూట్‌కేస్, మరో చేత్తో స్ట్రోలర్ లాక్కువస్తున్నాడు. మహితకి నవ్వొచ్చింది. కొద్దిసేపటికి ఆ హేండ్‌బేగ్ కూడా తగిలిస్తుందేమో అనుకుంది.

లగేజ్ కంపార్ట్‌మెంట్‌లో సామాను పెట్టి ముందుగా బస్ ఎక్కిన రోహిత, ముందు సీట్లో కిటికీ పక్క సీట్లో అక్కని కూర్చోపెట్టి తను పక్కన కూర్చుంది. అభిమన్యు భార్యతో వెనక్కి వెళ్ళిపోయాడు.

"దీన్ని చూసుకునేనా నిన్ను వదిలేసింది? ఏం బాగుంది? రంగు తప్ప ఏమీ లేదు. మనిషికి బొత్తిగా చెంచాకండలేదు. ఏమో అనుకున్నాకాని వెరీబేడ్ టేస్ట్" రోహిత చప్పరించింది.

"అందంగా ఉంది రోహీ, ఆ అమ్మాయేం చేసింది?" మహిత చెల్లెల్ని మందలించింది.

"నువ్వింత గంగిగోవు కాబట్టే వాడు అంత అలుసు తీసుకున్నాడు." రోహిత కోపంగా చెప్పింది.

బస్ 'ది హోటల్' ముందు ఆగింది. అంతా లగేజ్ రేక్‌లోంచి సామాను తీసుకుని లాంజ్‌లోకి వెళ్ళారు. గైడ్ అందరికీ తాళం చెవులిచ్చి చెప్పాడు.

"ప్రయాణం చేసి వచ్చారు. ఈ పూట రెస్ట్ తీసుకోండి. సాయంత్రం ఆరున్నరకి వచ్చి డిన్నర్‌కి తీసుకెళ్తారు. ఆరుంపావుకల్లా లాంజ్‌లో సిద్ధంగా ఉండండి."

మూడవ అంతస్థులోని తమ గదిలోకి వెళ్ళగానే మహిత మంచం మీద వాలిపోయింది. రోహిత బాత్‌రూంకి వెళ్ళొచ్చి కుర్చీలో కూర్చుని చెప్పింది.

"కొంచెం రంగు తక్కువైనా నువ్వెంత కళగా ఉన్నావో చూడు, వాడు నిన్నన్యాయం చేసి దాంతో హాయిగా ఉన్నాడు. నువ్వేమో అశోకవనంలో సీతలా ఎప్పుడూ ఆ కిటికీలోంచి చూస్తూంటావు. గుండె నిబ్బరం చేసుకో మహీ. వాడిని ఇంక మర్చిపో."

మహిత కళ్ళు తెరిచి బలహీనంగా చెప్పింది.

"ప్లీజ్ రోహీ 'వాడు, వాడు' అనకు. అభి ఇప్పుడు మనకేం కాదు. అతని జీవితం అతనిది. నేను నచ్చలేదు. విడాకులిచ్చాడు. అతను మనకి పరిచితుడు అంతే"

"ఇదేదో పెళ్ళికి ముందు చెప్పాలి మహీ. వేరేవారిని ప్రేమించినప్పుడు నీ జీవితాన్ని నాశనం చేయకూడదు."

"నా జీవితం నాశనం కాలేదు" మహిత ఉక్రోషంగా చెప్పింది.

"ఓహో! మొదటి రెండు నెలలు నువ్వెందుకు తిండి తినలేదు? ఎప్పుడూ ఏడుస్తూ పడుకుంటావ్ ఎందుకు? చదువుకునికూడా ఏ పనీ చేయకుండా నాన్నమీద ఎందుకు ఆధారపడ్డావు? గదిలోంచి బయటకి రాకుండా కిటికీలో కూర్చుని వాడికోసం ఎందుకు చూసావు? మన చుట్టాలు, ఫ్రెండ్స్ ఫంక్షన్స్‌కి పిలిస్తే ఎందుకు రావడం మానేసావ్? ఏం తప్పు చేసావని? అసలు ఈ యూరప్ ట్రిప్‌కి కారణం ఏమిటి? నిన్ను మనుషుల్లో పడేయాలనేగా? ఇదంతా నాశనం కాక వికాసమా?" రోహిత ఆవేశంగా అడిగింది. మహిత సిగ్గుపడింది. సమాధానం చెప్పలేని బలహీనతతో ఏడవసాగింది.

"వద్దు మహీ. అర్హతలేని వాళ్ళ కోసం ఒక్క క్షణం సమయంకాని ఒక్క కన్నీటి బొట్టుని కాని వృధా చేయకూడదు బి బ్రేవ్." రోహిత ఓదార్పుగా చెప్పింది.

మహిత లేచి బాత్‌రూములోకి వెళ్ళి తలుపు వేసుకుంది. రెండు నిమిషాల తర్వాత మొహం తుడుచుకుంటూ బయటకి వచ్చింది.

"సాయంత్రందాకా ఈ రూములో ఏం కూర్చుంటాం? రెండు బజార్లు తిరిగి వద్దాం పద" రోహితలేచి సాక్స్ వేసుకుంటూ చెప్పింది.

"పద" మహిత అంగీకరించింది.

టేబుల్ మీద ఉన్న  హోటల్ కార్డ్‌ని, కీ కార్డ్‌ని తీసుకుని గది తలుపు వేసి లిఫ్ట్‌లో కిందికి వచ్చారు.

చెల్లి కోప్పడుతుందని వచ్చింది కాని మహితకి మంచం మీద పడుకుని భోరున ఏడవాలి అనిపిస్తోంది – ఏకాంతంగా

హోటల్‌కి ఎడమవైపు రోడ్, కుడివైపు రోడ్‌లో కొద్దిసేపు తిరిగి గంటలో వెనక్కి వచ్చేసారు.

"ఆకలేస్తోందా?" ఓ పేస్ట్రీ షాప్ ముందు ఆగి రోహిత అడిగింది.

"లేదు. ఫ్లైట్‌లో బానే తిన్నాను. కొద్దిగా చలిగా ఉంది. వెళ్ళిపోదామా?" మహిత ఇబ్బందిగా అడిగింది.

"సరేపద" అక్క మనఃస్థితిని అర్ధం చేసుకుని రోహిత వెనుతిరిగింది.

సాయంత్రం ఆరుకే తయారై లాంజ్ లోకి వచ్చారు. అప్పటికే చాలామంది అందంగా రకరకాల ఆహార్యంతో తయారై వచ్చి, అక్కడున్న బుక్ స్టోర్స్, కేండీషాప్, సూవెనీర్ షాప్స్‌లో తిరుగుతున్నారు. పది నిమిషాల్లో ఇవాన్ వచ్చాడు. అంతా అతని చుట్టూ మూగారు.

మహిత, అభిమన్యు జంట కోసం చూసింది. అతను ఒక్కడే ఫ్లోరిస్ట్ షాప్‌లో పూలగుచ్చాలని చూస్తున్నాడు. భార్య పక్కనలేదు. ఇంకా తయారవలేదేమో.

మహితకి అప్రయత్నంగా తను అతనితో గడిపిన రోజులు గుర్తొచ్చాయి. ఎక్కడికైనా వెళ్ళాలన్నప్పుడు అతను ముందు తయారై, కారు కీస్ చేతిలో పట్టుకుని అసహనంగా కూర్చునేవాడు. ఐదు నిమిషాలు లేటైనా, చిరాగ్గా నుదుటిముడితో ఆమె వంక చూసి, బయటికి నడిచేవాడు. వేచి వుండటం అతనికి అసలు ఇష్టంలేదు. ఎంత ప్రయత్నించినా ఒక్కోసారి లేటయ్యేది. ఇప్పుడు ఈ కొత్త భార్య ట్రిప్ మొదటిరోజే లేటైంది. అతని ఫీలింగ్స్ చూడాలి అనుకుంది.

ఆరున్నర దాటిన ఐదు నిమిషాలకి ఓ వృద్ధ జంట వచ్చింది. మరో రెండు నిమిషాలకి అభిమన్యు భార్య వచ్చింది. అందమైన అవుట్ ఫిట్‌లో రాజహంసలా వచ్చి అతని పక్కన నిలబడింది.

మహిత ఆత్రంగా అభిమన్యు మొహంలోకి చూసింది. అతని కళ్ళల్లో ప్రశంస. పెదవులమీద చిరునవ్వు. ఆమె వంక ఆరాధనగా చూస్తున్నాడు.

మహిత రోహిత చెయ్యి పట్టుకుని వెళ్ళి బస్సెక్కింది.

మర్నాటినించి సిటీ టూర్ ఆరంభమైంది. ఒక్క మహితేకాదు. ఆ టూర్‌కి వచ్చిన చాలామంది ఆ జంటని గమనించారు. ప్రతీసారి బస్ దగ్గరకి ఆలస్యంగా వచ్చేది వాళ్ళే. రకరకాల భంగిమల్లో భార్యని ఫొటోలు తీయడంలోనే నిమగ్నమైన అభిమన్యుని చూస్తూంటే మహితకి ఆశ్చర్యంగా ఉంది. ఏడాదిన్నర కాపురంలో ఈ వ్యక్తిత్వాన్ని తను చూడలేదు. గంభీరంగా, అవసరమైనంతవరకే మాట్లాడుతూ ఎప్పుడూ ఫోన్‌తో కాలక్షేపం చేసే అభి ఆమెతో ఎంత ఉల్లాసంగా ఉన్నాడు? 'నయం విడాకులు ఇవ్వనని కోర్ట్ కెక్కి సమస్యని ఏ ఏడేళ్ళో సాగదీయలేదు తను' అనుకుంది.

మొదట్లో గుండెల్లో మంటగా అనిపించినా ఇప్పుడా జంటని చూస్తూంటే, ఎందుకో అపరిచితుల్లా అనిపిస్తోంది అనుకుంది. ఈ భావాలు పంచుకుంటే చెల్లెలితో చివాట్లు తప్పవు కాబట్టి తను కూడా నెమ్మదిగా ఆ చారిత్రాత్మక నగర విశేషాలని ఆసక్తిగా వింటూ ట్రిప్‌ని ఎంజాయ్ చేయసాగింది.

"అభి ఇంత రొమేంటిక్ అనుకోలేదు. శిల్పాల పక్కన అదే భంగిమల్లో ఆ అమ్మాయిని నుంచోపెట్టి ఫొటోలు తీస్తున్నాడు" రోహిత ఓ రోజు నవ్వుతూ చెప్పింది.

"అవును. ఈ మనిషి నాకు తెలీదు" మహితకూడా నవ్వింది.

పేరిస్ సందర్శన ముగిసింది. ఆ రాత్రి భోజనాలు మిగిసాక వాళ్ళని హోటల్ దగ్గర దింపుతూ ఇవాన్ చెప్పాడు.

"ఇక్కడితో మన ఫ్రాన్స్ టూర్ ముగిసింది. రేపు ఉదయం ఆరింటికి వేకప్ కాల్, ఏడుకి బ్రేక్ ఫాస్ట్. ఎనిమిదికి మీ లగేజ్‌తో బస్‌లో ఉండాలి. మనం బెల్జియం వెళ్తున్నాం. వాటర్లూలో మన టూర్ రేపు మధ్యాహ్నం నించి స్టార్టవుతుంది. రేపు రాత్రి బస బ్రసెల్స్‌లో. దయచేసి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బయలుదేరండి. కాదంటే కొన్ని ప్లేసెస్ మిస్సవుతారు. ఈ రాత్రే మీ సామాను సర్దుకోండి."

అంతా సరేనన్నట్లుగా బొటన వేళ్ళు చూపించారు.

ఉదయం ఎనిమిదీ పదికి బస్ బెల్జియం దేశానికి బయలుదేరింది. అభిమన్యు ఈసారి రెండు సూట్‌కేసులు ఎక్కించడం చూసి రోహిత అక్కతో చెప్పింది.

"ఇక్కడ బాగా షాపింగ్ చేసినట్లున్నారు. సూట్‌కేస్‌తో సహా కొన్నారు."

మహిత అది పట్టించుకోకుండా చెప్పింది.

"మిసెస్ సింగ్ నిన్నంతా కాళ్ళనొప్పులని బాధపడింది. ఆవిడకి ఎలా ఉందో?"

రోహిత ఓ క్షణం అక్కవైపు చూసి ఆప్యాయంగా ఆమె చేతిని పట్టుకుంది.

అకస్మాత్తుగా అభిమన్యు వెనకనించి వచ్చి ముందు సీట్లో కూర్చున్న ఇవాన్‌తో ఏదో చెప్పడం, ఇవాన్ మొహం విసుగ్గా పెట్టి తల అడ్డంగా ఊపడం బస్‌లో వాళ్ళంతా గమనించారు. కొద్ది సంభాషణ తర్వాత ఇవాన్ బస్ డ్రైవర్‌తో ఫ్రెంచ్ భాషలో ఏదో చెప్పాడు. బస్ రోడ్ పక్కగా ఆగింది.

అభిమన్యు భార్యతో సహా బస్ దిగాడు. తన లగేజ్‌ని తీసుకుని ఇవాన్‌కి నవ్వుతూ వీడ్కోలు చెప్పాడు. ఇవాన్ అతనికి కొన్ని జాగ్రత్తలు చెప్పి బస్ ఎక్కాడు.

"ఏమైంది?" ఆత్రం ఆపుకోలేని ఓ ముసలాయన బస్ బయలుదేరగానే అడిగాడు.

"అతని భార్య ఫోన్ అనుకుని టి.వి రిమోట్‌ని బేగ్‌లో వేసుకొచ్చిందిట. హోటల్‌కి ఫోన్ చేస్తే అది అక్కడే ఉందని చెప్పారు. బస్‌ని వెనక్కి తిప్పలేం కాబట్టి తను దిగిపోయి టేక్సీలో వెనక్కి వెళ్ళి ఫోన్ తీసుకుని ట్రైన్‌లో బ్రసెల్స్ వస్తామని చెప్పాడు. వాళ్ళు వాటర్లూ మిస్సవుతారు" ఇవాన్ చెప్పాడు.

మహితకి హఠాత్తుగా తను ఓసారి ఇంటి తాళాలు అమ్మ వాళ్ళింట్లో మర్చిపోతే, పంజగుట్టనించి హిమాయత్‌నగర్‌కి వెళ్ళి వాటిని తీసుకురావడానికి అభిమన్యు ఎంత ధుమధుమలాడాడో గుర్తొచ్చింది. 'ప్రేమలేని చోట క్షమ ఉండదు' అనుకుంది.

బస్ కిటికీలోంచి చూస్తే దూరంగా రోడ్ దాటుతున్న ఆ జంట కనిపించారు.

వాటర్లూలోని చారిత్రాత్మక ప్రదేశాలని తిరిగి చూసాక బస్ బ్రసెల్స్ బయలుదేరింది. అప్పటికే చీకటిపడుతోంది.

"మనం హోటల్‌కి వెళ్ళి ఫ్రెష్ అయి డిన్నర్‌కి వెళ్దాం. రేపు బ్రసెల్స్‌లో మన టూర్ మొదలవుతుంది" ఇవాన్ చెప్పాడు.

బస్ ఫోర్ సీజన్స్ హోటల్ ముందు ఆగింది. అంతా తమ సామానుతో హోటల్ లాంజ్‌లోకి నడిచారు. అక్కడ వీళ్ళ కోసం వేచివున్న అభిమన్యు లేచి ఇవాన్ దగ్గరకి వచ్చి నవ్వుతూ ఏదో మాట్లాడడం గమనించిన మహిత 'ఇతను ఇంత పాజిటివ్‌గా ఉంటాడా?' అని మరోసారి ఆశ్చర్యపోయింది.

ఏడున్నరకి అంతా రెస్టరెంట్‌కి బయలుదేరారు.

"ఛ!ఛ! వెధవ సీన్స్ చూడలేక చస్తున్నా" భోజనం ముగించి చేతుకు కడుక్కుని వస్తూ రోహిత చిరాగ్గా చెప్పింది.

తలవంచుకుని ఐస్‌క్రీం తింటున్న మహిత అడిగింది.

"ఏమైంది?"

"నువ్వే చూడరాదూ"

"వద్దులే చెప్పు" మహిత దీక్షగా ఐస్‌క్రీం వంక చూస్తూ అడిగింది.

"దానికి తినిపిస్తున్నాడు. అది గారాలు పోతూంటే, 'ఈ కొంచెం తిను. రేపటినించి చాలా తిరగాలి' అంటున్నాడు."

"ఓహో"

రోహిత అక్కవంక నిశితంగా చూసింది. తర్వాత ఏం మాట్లాడలేదు.

రూంకి వచ్చాక మహిత నైట్ డ్రెస్‌లోకి మారి, బ్రష్ చేసుకొచ్చి చెల్లెలి పక్కన పడుకుంది.

"సారీ మహీ, అభి, నేను రెండు విధాలుగా నిన్ను బాధపెట్టాం" రోహిత పశ్చాత్తాపంగా చెప్పింది.

"లేదు. మొదటి రోజు నేను కొంచెం ఎమోషనలైన మాట నిజమే కాని ఇప్పుడు బానే వున్నా. రోహీ మీ ఆఫీస్‌లో వేకెన్సీస్ ఉన్నాయన్నావు కదా? నన్ను రికమెండ్ చేస్తావా?" మహిత నెమ్మదిగా అడిగింది.

రోహిత సంభ్రమంగా అక్కవైపు తిరిగి అడిగింది.

"నిజంగా? మహీ నువ్వు జాబ్ చేస్తే నాకంటే సంతోషించేవాళ్ళు ఉండరు. డబ్బు కోసం కాదు. నువ్వు మళ్ళీ మనుషుల్లో పడుతున్నావనే సంతోషం. అమ్మా నాన్న ఈ ఏడాదిగా ఎంత బాధపడుతున్నారో నాకు తెలుసు. నువ్వు నార్మల్‌గా ఉంటే వాళ్ళకి బాగుంటుంది. రేపే మా మేనేజర్‌కి మెయిల్ ఇస్తాను"

మహిత చెల్లెలి చెంపని మృదువుగా నిమిరింది.

"ఏర్‌పోర్ట్‌లో ...అభిని చూడగానే 'అబ్బా' అనుకున్నాను. నువ్వు మామూలుగా మారాలి అని నిన్ను తీసుకొచ్చాను. మళ్ళీ వాళ్ళ ప్రేమ కలాపాలతో డిస్టర్బ్ అవుతావేమోనని భయమేసింది. అందుకే సంస్కారం లేకుండా వాడు వీడు అన్నాను" రోహిత కళ్ళు చెమర్చుతూంటే చెప్పింది.

"ఇప్పుడు నాకు జ్ఞానోదయమైంది రోహీ. నేనింక అభి గురించి ఆలోచించను. నా జీవితం నేను జీవిస్తా. నిన్నూ అమ్మా నాన్నలని బాగా ఇబ్బంది పెట్టా. సారీ"

"విడాకులు అనేది ఏ కాలం పిల్లలకైనా ట్రామానే మహీ, నువ్వు మళ్ళీ మామూలుగా మారుతున్నావంటే చాలా హేపీగా ఉంది." రోహిత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మాది అరేంజ్డ్ మారేజ్. నేను అతనితో బానే అడ్జస్ట్ అయ్యాకాని, అభి ఊహించుకున్న భార్య నేను కాదు. అలాంటి నాతో ఉండాలంటే, అతనికి అసహనంగా ఉండేది. ఇంట్లో ఉన్నప్పుడు ఆ మొహంలో చిరాకు తప్ప ఏమీ చూడలేదు. నువ్వా నవ్వేదానివి కదా 'బావకిఈ వయసులో ఈ చిరాకేంటి? పువ్వులని, పిల్లల్ని చూపించు' అని. సొసైటీ అంటే భయంతో, నామీద సానుభూతితో అతి కష్టమ్మీద ఏడాది ఉన్నాడు. కాని అతనివల్ల కాలేదు. అతను నాతో చెప్పిన కారణం 'నేను నిన్ను ప్రేమిచలేకపోతున్నాను. సారీ. మనం విడాకులు తీసుకుందాం' అజ్ఞానంతో నాకు అది అర్థం కాలేదు. ఏడ్పులు, పెడబొబ్బలు, అమ్మవాళ్ళు ఇన్‌వాల్వ్‌మెంట్ అతనికి ఇంకా కోపాన్ని తెప్పించాయి. ఇప్పుడు ఈ ట్రిప్‌లో తను

ప్రేమించి పెళ్ళిచేసుకున్న అమ్మాయితో అతని ప్రవర్తన చూసాక, 'నిజమైన అభి అంటే ఇతను. పాపం ఏడాదిపాటు అయిష్టంగా నాతో ఉన్నాడు' అనిపించింది. సక్సెస్‌ఫుల్ పెళ్ళికి సూత్రం కులం, మతం, కట్నాలు, ఆస్థులు కాదు ప్రేమ. ప్రేమించి పెళ్ళి చేసుకోవడం లేదా పెళ్ళి చేసుకుని ప్రేమించడం. ఆ రెండూ కాకపోవడంతో నేను ఫెయిలయ్యాను. థాంక్స్ రోహీ ఈ ట్రిప్‌కి రాకపోతే నేనింకా సెల్ఫ్ పిటీతో గదిలో కూర్చుని కిటికీలోంచి చూస్తూండేదాన్ని. థాంక్స్ టు పేరిస్.""

రోహితకి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"నువ్వు ప్రేమించి పెళ్ళి చేసుకో రోహీ"

ఒక నిమిషం ఆగి మహిత ఆశావహంగా చెప్పింది.

"మంచబ్బాయ్ దొరికితే నేనూ..."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments